సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం ¦ 17 ¦ మే ¦ 2025

I



ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలి
తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలంటూ ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. - IIIలో



పొదుపుగా వాడుకోవాలి
సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బలరామ్, కృష్ణ అన్నారు. - IIIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37°/26°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

భువనగిరిటౌన్ : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ మాట్లాడుతూ దివ్యాంగులు 30 రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అవన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వన ఉపేందర్, సామాజిక ఉద్యమ నేత బట్టు రామచంద్రయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, ఉపాధ్యక్షురాలు బర్ల పార్వతి, మాదిరే పద్మ, బల్గురు అంజయ్య పాల్గొన్నారు.

'ప్రీ లిటిగేషన్' ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చు

భువనగిరి : కోర్టుకు లేదా ఫోరం ముందుకు రాలేని వయోవృద్ధులు ప్రీ లిటిగేషన్ వాజ్యాల ద్వారా సివిల్ కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవీలత సూచించారు. భువనగిరి మండలం చీమలకొండూరు పరిధిలో గల బెజ్జ లక్ష్మయ్య ఫౌండేషన్ ఆశ్రమంలో ఉంటున్న ఓ వృద్ధురాలు తన కుమారులు తన బాగోగులు చూడటం లేదని న్యాయ సేవాధికారి సంస్థకు దరఖాస్తు చేసుకుంది. జడ్జి మాధవీలత శుక్రవారం బాధితురాలి దరఖాస్తును పరిశీలించారు. వృద్ధురాలి కుమారులను పిలిపించి ప్రతి నెలా రూ.20 వేలు ఇవ్వడంతో పాటు ఆమె బాగోగులను చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ తదితరులు ఉన్నారు.

20న ఉచిత వైద్యశిబిరం

సంఘటిత, అసంఘటిత కార్మికుల కోసం జిల్లా కార్మిక శాఖ, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జడ్జి మాధవీలత తెలిపారు. వైద్య శిబిరాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్టిఫికెట్‌లు ప్రదానం



సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తున్న వీసీ

నల్లగొండ టూటౌన్ : సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ సంస్థ నిర్వహించిన నైపుణ్య శిక్షణ అభివృద్ధి (టాస్క్)కి సహకరించిన యూనివర్సిటీ సిబ్బందికి శుక్రవారం ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సరిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీని టాస్క్‌ను రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అల్వాల్ రవి, డాక్టర్ వై.ప్రశాంతి, సుధారాణి, జయంతి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 2025–26 విద్యా సంవత్సరంలో ఎస్సీ విద్యార్థులకు 1వ తరగతిలో డే స్కాలర్, 5వ తరగతిలో రెసిడెన్షియల్‌లో ప్రవేశం కల్పించేందుకు అర్హత కలిగిన ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


ఆర్టీసీలో టెండర్లు

రామగిరి(నల్లగొండ): ఆర్టీసీ నల్లగొండ రీజియన్‌లోని బస్ స్టేషన్లలో పలు పనులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ జానిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బస్ స్టేషన్లలో ఖాళీ షాపులు, వాహన పార్కింగ్, లాజిస్టిక్ సర్వీసెస్ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు www.tgrtc.teangana.gov.in వెబ్‌సైట్‌ను, ఆన్‌లైన్ టెండర్‌లో పాల్గొనేందుకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి 73828 34223 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నకిలీ కట్టడికి టాస్క్‌ఫోర్స్

వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు

- ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలకు సిద్ధం
- జిల్లా సరిహద్దులు, గతంలో నకిలీ సీడ్ పట్టుబడిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- మూడు కంటే ఎక్కువ సార్లు పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్



ఆలేరు: వానాకాలం సాగు షురూ అయింది. చాలా మంది రైతులు వరి, పత్తి పంటలు అధికంగా సాగు చేస్తుంటారు. ఇదే సమయంలో అనుమతి లేని విత్తనాలు, బీటీ–3 విత్తనాలు, నకిలీ సీడ్‌ను మార్కెటింగ్ చేసుకోవడానికి వ్యాపారులు ప్రయత్నిస్తుంటారు. ఆకర్షణీయంగా ఉండే రంగురంగుల ప్యాకెట్లలో నింపి, తమ వంగడాలు అధిక దిగుబడి ఇస్తాయని నమ్మబలుకుతూ వాటిని రైతులకు అంటగడుతుంటారు. నకిలీ విత్తనాల వల్ల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. దీన్ని అరికట్టేందుకు వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా వ్యూహాలను సిద్ధం చేశాయి. నకిలీ విత్తన ముఠాల ఆటకట్టించేందుకు మూడు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల(స్క్వాడ్)ను ఏర్పాటు చేశాయి.

ఇదీ.. టాస్క్‌ఫోర్స్ టీం

టాస్క్‌ఫోర్స్ బృందంలో వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ), ఇద్దరు మండల వ్యవసాయ అధికారులు, ఒక ఏఎస్‌ఐ, ఒక కానిస్టేబుల్ ఉంటారు. వీరికి ఏడీఏ నేతృత్వం వహిస్తారు. జిల్లాలో 17 మండలాలు ఉండగా రెండు బృందాలు ఐదు మండలాల చొప్పున, ఒక బృందం ఏడు మండలాల్లో తనిఖీలు చేస్తుంది. రైతుల భాగస్వామ్యంతో టీంలు పని చేయనున్నాయి. టీంల పనితీరుపై కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, డీసీపీ పర్యవేక్షణ ఉంటుంది.

తనిఖీలకు సిద్ధం

వ్యవసాయ సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనుమానిత ప్రదేశాలు, ఎరువులు, విత్తన దుకాణాలతో పాటు ఫిర్యాదులు అందిన షాపుల్లో టాస్క్‌ఫోర్స్ టీంలు తనిఖీలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి.అంతేకాకుండా జిల్లా సరిహద్దు ప్రాంతాలు, గతంలో అధికంగా నకిలీ విత్తనాలు పట్టుబడిన మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాయి. వరుసగా మూడుదఫాల కంటే ఎక్కువ సార్లు పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నారు. అదే విధంగా నాసిరకం విత్తనాలు కొనుగోలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించనున్నారు. లైసెన్స్‌డు డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటారు.

> యాదాద్రి భువనగిరి జిల్లాలో వానాకాలం 4.35 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. అందులో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి, 1.10 లక్షల ఎకరాల్లో పత్తి, మిగతా ఎకరాల్లో ఇతర పంటలు సాగు కానున్నాయి.

విత్తన ఎంపికలో జాగ్రత్త

నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. లైసెన్స్‌డు డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ ధరకు విక్రయిస్తున్నారని, ఆఫర్లు, రంగురంగుల ప్యాకెట్లను చూసి మోసపోవద్దని, విత్తన నాణ్యత, మొలక శాతం, కంపెనీ బ్రాండెడ్ వివరాలను పరిశీలించిన తరువాతే కొనుగోలు చేయాలని చెబుతున్నారు.

నకిలీ సీడ్ అమ్మితే క్రిమినల్ కేసులు



రైతులు నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దన్న ఉద్దేశంతో తనిఖీల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకంగా మూడు టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశాం. నిషేధిత, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, విత్తనాలు సీజ్ చేస్తాం. జిల్లాలోని 17 మండలాలతో పాటు సరిహద్దు ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంటుంది. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. రైతులు విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్‌డు డీలర్ల వద్దనే కొనాలి.
–గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

గతంలో పట్టుబడిన నకిలీ విత్తనాలు

గతంలో మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి తీసుకువచ్చిన నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ టీంలు పట్టుకున్నాయి.



డెంగీ దినోత్సవం సందర్భంగా భువనగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

డెంగీరహిత జిల్లాగా మార్చుదాం

- డీఎంహెచ్ఓ మనోహర్

భువనగిరి : డెంగీరహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తాము ఉంటున్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డేగా పాటించాలని కోరారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వీణ, డాక్టర్ నిరోష, డిప్యూటీ డెమో అంజయ్య, ఆశ నోడల్ ఆఫీసర్ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

- కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు(ఎం): మండలంలోని లింగరాజుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. లింగరాజుపల్లిలో కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయని ఫిర్యాదు అందడంతో పాటు రైతులు రాస్తారోకో చేయడంతో ఆయన కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యం, తూకం వేయని ధాన్యం వివరాలు కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.రైతులతో మాట్లాడి రాస్తారోకో చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ లావణ్య, ఆర్ఐ మల్లికార్జునరావు ఉన్నారు.

2.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సాక్షి,యాదాద్రి : జిల్లాలో ఇప్పటి వరకు 2.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేశామని, పక్షం రోజుల్లో మరో లక్ష టన్నులు సేకరిస్తామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి కలెక్టర్ మాట్లాడారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ.452 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ధాన్యం ఎక్కువ ఉన్న కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.



లింగరాజుపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హనుమంతరావు

కనుల పండువగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాధస్వరం వినిపించారు.

సంప్రదాయ పూజలు

ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం, ముఖ మండపంలో జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి హారతినిస్తున్న అర్చకుడు

భూ భారతి దరఖాస్తులు 128

- ఆత్మకూరు(ఎం) మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు
- అత్యధికంగా సర్వే నంబర్ల మిస్సింగ్‌పై ఫిర్యాదులు
- జూన్ 2వ తేదీన పరిష్కార పత్రాలు

ఆత్మకూరు(ఎం): భూ భారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు భూ సమస్యల సత్వర పరిష్కారానికి ఆత్మకూర్(ఎం) మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 128 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా సర్వే నంబర్ల సమస్యకు సంబంధించి 11 ఫిర్యాదులు ఉన్నాయి. భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఆత్మకూర్(ఎం) మండలాన్ని ఎంపిక చేశారు. ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు తహసీల్దార్ లావణ్య ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సదస్సులను కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.

మిస్సింగ్ సర్వే నంబర్లు	11
పెండింగ్ మ్యుటేషన్	04
డిజిటల్ సంతకం పెండింగ్	08
విస్తీర్ణంలో తేడాలు	25
పేర్లలో తప్పుల సవరణ	08
లావణి పట్టా	07
అసైన్డ్ ల్యాండ్	02
పౌతి	22
ఇతర సమస్యలు	41

1,828 దరఖాస్తు ఫారాలు పంపిణీ

మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో 1,828 మంది రైతులకు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. పలు రకాల భూసమస్యలపై 128 దరఖాస్తులు అందాయి.

రెవెన్యూ గ్రామాల వారీగా దరఖాస్తులు

రాయిపల్లిలో 15, సర్వేపల్లి 5, రహీంఖాన్‌పేట 31, రాఘవాపురం 4, సింగారం 3, పల్లెర్ల 16, కాల్వపల్లి 1, లింగరాజుపల్లి 6, కప్రాయపల్లి 2, కూరెళ్ల 7, పారుపల్లి 2, తుక్కాపురం 7, పల్లె పహాడ్ 2, మొరిపిరాల 10, ధర్మారం 2, కొరటికల్ 7, ఆత్మకూర్(ఎం) 8 దరఖాస్తులు వచ్చాయి.

1లోగా పరిష్కారం

రైతులకు సహకారం అందించేందుకు ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. రెవెన్యూ సిబ్బంది రైతుల దరఖాస్తు ఫారాలు నింపి ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి జూన్ 1వ తేదీలోగా సమస్య పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించారు. జూన్ 2వ తేదీన దరఖాస్తుదారులకు పరిష్కార పత్రాలు ఇవ్వనున్నారు.



ఆత్మకూరు(ఎం)లో జరిగిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

ఆధారాలతో దరఖాస్తు చేశాం



మా తాత ఉప్పల రామయ్యకు చెందిన 17 గుంటల భూమిని 2019–20లో అధికారులు ఇతరులకు అక్రమ పౌతి చేశారు. దీనిపై పూర్తి ఆధారాలతో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేశాం. అధికారులు పరిశీలించారు. విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్య చెప్పుకునే అవకాశం వచ్చింది.
–మత్స్యగిరి కూరెళ్ల, ఆత్మకూరు(ఎం) మండలం

జూన్ 2న పరిష్కార పత్రాలిస్తాం



మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు సజావుగా పూర్తి చేశాం. రైతులు అందజేసిన దరఖాస్తులను పరిశీలించాం. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అనంతరం జూన్2వ తేదీన పరిష్కార పత్రాలు అందజేస్తాం. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఉన్నతాధికారులకు, సదస్సులు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.
–లావణ్య, తహసీల్దార్, ఆత్మకూరు(ఎం)

గాలి, వాన బీభత్సం



అడ్డగూడూరు మండలం డి.రేపాకలో పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు



గుండాల మండలం తుర్కలశాపురంలో ఈదురు గాలులకు లేచిపోయిన ఇళ్ల రేకులు

- అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పు రేకులు, కూలిన చెట్లు
- పిడుగుపాటుకు మూగజీవాలు మృతి

అడ్డగూడూరు: పలు మండలాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి అడ్డగూడూరు మండలం కంచనపల్లిలోని పీఏసీఎస్ కేంద్రంలో ఎగుమతి చేయడానికి డీసీఎంలో లోడ్ చేసిన 200 బస్తాల ధాన్యం తడిసింది. దీంతో పాటు కాంటా వేసిన మరో 350 వందల బస్తాల వడ్ల బస్తాల కిందికి నీరు చేరింది. తహసీల్దార్ శేషగిరిరావు, ఏఓ పాండురంగాచారి, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. మహాలక్ష్మి రైస్‌మిల్లు యజమానితో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ఒప్పించారు. డి.రేపాకలో పిడుగుపాటుకు 13 గొర్రెలు మృతి చెందాయి.

- గుండాల మండలం రామారంలో మలిపెద్ది బక్కారెడ్డికి చెందిన రెండు గేదెలు పిడుగుపాటుకు మృతిచెందాయి. లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ఈదురు గాలులకు తుర్కలశాపురంలో శీల లింగస్వామి ఇంటి రేకులు ఎగిరిపోయాయి. ఇదే గ్రామంలో రోడ్డుపై చెట్టు కూలడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



తుర్కలశాపురంలో రోడ్డుపై కూలిన చెట్టు

ఆరెంజ్ అలర్ట్

భువనగిరిటౌన్ : ఉపరితల ద్రోణి కారణంగా జిల్లాల్లోని పలు మండలాల్లో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అక్కడక్కడ పిడుగులు, 50నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచి వర్షం కురిసే అవకాశం ఉండటంతో జిల్లాను ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించింది.

మండలాల వారీగా వర్షపాతం (మి.మీ)

గుండాల 44.8, బొమ్మలరామారం 32.3, యాదగిరిగుట్ట 23, మోత్కూరు 22.8, భూదాన్‌పోచంపల్లి 21.3, అడ్డగూడూరు 18.3, బీబీనగర్ 15, భువనగిరి 10.3, తుర్కపల్లి 10, ఆత్మకూర్(ఎం) 6, మోటకొండూరు 4, వలిగొండ 3.5, ఆలేరు 3.2, రామన్నపేట మండలంలో 3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మూలనపడ్డ కుమ్మరి సారె..

యాదగిరిగుట్ట రూరల్: సారెపై మట్టిపాత్రలు తయారు చేసే కుమ్మరుల జీవనశైలి అగమ్యగోచరంగా మారిందనడానికి నిదర్శనం ఈ చిత్రం. యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి మధిర గ్రామమైన కుమ్మరిగూడెంలో కులవృత్తి కుటుంబాలు 20 వరకు ఉంటాయి. మార్కెట్‌లోకి రెడీమేడ్ కుండల రాకతో వారి జీవనంపై తీవ్ర ప్రభావం చూపింది. కులవృత్తికి ఆదరణ లేకపోవడంతో నేటి తరం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. వారి తల్లిదండ్రులు వృత్తిని మానేసి కూలి పనులకు వెళ్తున్నారు. దీంతో సారెలు మూలనపడ్డాయి.



అర్జీలు వేలల్లో.. మంజూరు వందల్లో!

అర్హులందరికీ అందని రేషన్ కార్డులు

- కొత్తగా 405 మందికే మంజూరు
- ఎదురుచూపుల్లో మిగతావారు

ఆలేరురూరల్: జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 96,792 మంది దరఖాస్తు చేసుకోగా.. కేవలం 405 మందికి మాత్రమే మంజూరయ్యాయి. దీంతో ప్రతి రోజూ దరఖాస్తుదారులు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రజాపాలన గ్రామసభల్లో తెల్ల రేషన్‌కార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. గ్రామసభల్లో 96,792, మీసేవ కేంద్రాల ద్వారా 1,029 దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు పాత కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదుకు 21,770 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 20,133 దరఖాస్తులను ఓకే చేశారు. 1,637 పెండింగ్‌లో ఉన్నాయి.

నిరాశలో వేలాది మంది..


అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ప్రజాపాలన గ్రామసభలు, మీసేవ కేంద్రాల ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన అధికారులు తొలి విడతలో 405 కార్డులకే మంజూరు ఇచ్చారు. సుమారు లక్ష వరకు దరఖాస్తులు రాగా కొద్ది మందికే కార్డులు మంజూరు చేయడంతో మిగతా వారు అయోమయంలో ఉన్నారు. తమకు కార్డులు వచ్చేసరికి ఎన్నేళ్లు పడుతుందోనని మదనపడుతున్నారు. కొత్త కార్డులు మంజూరుకాకపోవడంతో ప్రభుత్వ పథకాలు, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలకోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్త కార్డుదారులకు సన్నబియ్యం

ఏప్రిల్ కోటా ప్రకారం జిల్లాలో 2,16,904 కార్డులు, 6,76,188 యూనిట్‌లు ఉన్నాయి. వీరికి 4,307 టన్నుల బియ్యం అవసరం. వీరితో పాటు కొత్తగా మంజూరైన 405 (20,133 యూనిట్‌లు) కార్డులకు ఈ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.

అర్హులందరికీ కార్డులు



రేషన్ కార్డు మంజూరుకాని దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దు. విడతల వారీగా అర్హులందరికీ వస్తాయి. నూతన కార్డుదారులకు మేనెల సన్నబియ్యం పంపిణీ చేశాం. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే కొందరు అమ్ముకునేవాళ్లు. ప్రస్తుతం సన్న బియ్యాన్ని అందరూ ఇష్టంగా తీసుకెళ్తున్నారు.
–అంజిరెడ్డి, తహసీల్దార్, ఆలేరు

క్లుప్తంగా

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట రూరల్: ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన సదా ప్రవీణ్ కుమార్ (36), గురువారం రాత్రి తన సొంత పనుల నిమిత్తం యాదగిరిగుట్టకు చెందిన ఆటో డ్రైవర్ ఉట్కూరి రాజు గౌడ్‌తో కలిసి ఆటోలో గౌరాయపల్లికి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి యాదగిరిగుట్టకు వస్తున్న క్రమంలో గౌరాయపల్లి గ్రామ శివారులోని దుర్గమ్మ గుడి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న సదా ప్రవీణ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ రాజుకు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

చిట్యాల: చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల ఎస్‌ఐ అమ్రీన్ నసీహా తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా దాచెపల్లి మండలం తంగేడ గ్రామానికి చెందిన తోకల రవి(45) అతని తల్లి నాగమ్మ, డ్రైవర్ పోల్ సాగర్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి పరిధిలోని దూస్ పంజాబి దాబా వద్దకు రాగానే దాబా నుంచి లారీ అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రవికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని వెంటనే నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తోకల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బుచ్చిరెడ్డికి స్ఫూర్తి పురస్కారం



కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

కనగల్ : బాల సాహిత్యంలో చేస్తున్న కృషికి గాను కోమటిరెడ్డి బుచ్చిరెడ్డిని వసుంధర విజ్ఞాన వికాస మండలి (కరీంనగర్) స్ఫూర్తి పురస్కారానికి ఎంపిక చేసినట్లు జ్యూరీ కమిటీ శుక్రవారం ప్రకటించింది. త్వరలో హైదరాబాద్ జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు నిర్వాహకుడు వైద్యుల మధుకర్ తెలిపారు. ప్రస్తుతం బుచ్చిరెడ్డి కనగల్ మండల పరిధిలోని చినమాదారం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

నల్లగొండలో కార్డన్ సెర్చ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

- ధ్రువపత్రాలు లేని 165 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు సీజ్

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో గురువారం అర్ధరాత్రి నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గురువారం రాత్రి 11 గంటల నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు పట్టణంలోని మాన్యంచెల్కలో సుమారు 500 ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. 8 మంది సీఐలు, 24 మంది ఎస్‌ఐలు, 80 మంది కానిస్టేబుళ్ల మొత్తం 320 మందితో తనిఖీలు నిర్వహించారు. జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి వలస ఉంటున్న వారిని గుర్తించారు. అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలు సేకరించి వారి ఆధార్ కార్డులతో ఆన్‌లైన్‌లో విచారణ చేశారు. నలుగురు రౌడీ షీటర్లతోపాటు 30 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరందరికీ గంజాయి పరీక్షలు నిర్వహించగా ఎనమిది మందికి పాజిటివ్ వచ్చింది. అదేవిధంగా ధ్రువపత్రాలు లేని 165 వాహనాలను, నాలుగు ఆటోలను సీజ్ చేశారు. అక్రమంగా ఎయిర్‌లేన్ కలిగిన వ్యక్తితోపాటు గాంజా చాక్లెట్లను అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మరోసారి నాకాబందీలో దొరికితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

అనుమానం వస్తే సమాచారం ఇవ్వాలి

కమ్యూనిటీ కాంటాక్టులో భాగంగా నల్లగొండ పట్టణంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. కాలనీల్లో, ఇంటి ప్రదేశాల్లో అనుమానిత వ్యక్తులు కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. పట్టణాన్ని నేర రహితంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రజలకు శాంతిభద్రతలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు మూడు దశల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా గంజాయి తాగుతున్నట్లు, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్ రెడ్డి, నాగరాజు, రాజశేఖర్, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, సీఐ కరుణాకర్, ఎస్‌ఐలు సైదాబాబు, వై.సైదులు, శంకర్, గోపాల్‌రావు, సందీప్ రెడ్డి, మానస పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి యువకుడు మృతి



అబ్దుల్ ఖలీల్ (ఫైల్)



ప్రమాదానికి గురైన కారు

మునగాల: కారు అదుపు తప్పి బోల్తా పడడంతో యువకుడు మృతిచెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్సై వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖలీల్(25) తన స్నేహితులు మహమ్మద్‌కైసర్ అలీ, అబ్దుల్లా అంజద్, దిలీప్‌కుమార్‌లు కలిసి కారులో డ్రైవర్ మహ్మద్ యాసిన్‌తో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో మహ్మద్ అబ్దుల్ ఖలీల్ డ్రైవర్‌ను పక్కకు తప్పించి కారు నడుపుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మునగాల మండలం బరాఖత్‌గూడెం వద్ద గల ఫ్లైఓవర్ పైకి చేరుకున్న తర్వాత అబ్దుల్ ఖలీల్ కారును అతివేగంగా నడపడంతో అదుపుతప్పి కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న అబ్దుల్ ఖలీల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్నేహితులు అతడిని 108వాహనంలో చికిత్స నిమిత్తం కోదాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి బాబాయి మహ్మద్ అబ్దుల్ హబీబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటరత్నం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రఘునాథపల్లి: వరంగల్–హైదరాబాదు జాతీయ రహదారిలోని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ బస్ స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేందర్‌రెడ్డి (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన రాజేందర్‌రెడ్డి నిడిగొండలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టి జీవనం కొనసాగిస్తున్నాడు. రాత్రి 7 గంటల సమయంలో పనినిమిత్తం ద్విచక్రవాహనంపై పెట్రోలు బంక్ వైపు వెళ్తుండగా వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మోటార్ల కేబుల్ వైరు చోరీ చేసిన వ్యక్తి రిమాండ్

నేరేడుచర్ల : వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్ల చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన పస్తం అశోక్ అలియాస్ అనిల్‌కుమార్ అనే వ్యక్తి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం శివారులో ఈనెల 13న 10 విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లను చోరీ చేశాడు. వీటిని అమ్మేందుకు ఈనెల 15న మిర్యాలగూడకు వెళ్తుండగా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని పట్టుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతడి వద్ద ఉన్న మోటార్ బైక్‌తో పాటు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశువులను తరలిస్తున్న మూడు వాహనాల పట్టివేత

కేతేపల్లి: అక్రమంగా 29 గోవులు, గేదెలను తరలిస్తున్న మూడు వాహనాలను కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో శుక్రవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కేతేపల్లి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈక్రమంలో మూడు మినీ వాహనాల్లో ఆవులు, గేదెలను విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

పిడుగుపాటుతో గేదెలు మృతి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి శివారులో గురువారం రాత్రి పిడుగుపడి మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన వేముల నాగయ్య తన గేదెలను ఇంటి ఎదురుగా ఉన్న చెట్ల కింద కట్టి వేశాడు. ఒక్కసారిగా పిడుగు పడడంతో మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.10లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.


చౌదర్‌పల్లిలో రెండు ఆవులు..

బొమ్మలరామారం: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన పిట్టల నర్సింహకు చెందిన రెండు ఆవులు శుక్రవారం తెల్లవారు జామున పిడుగుపాటుతో మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి జైలు

రామగిరి(నల్లగొండ): యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడికి జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు మూడవ అదనపు జడ్జి దుర్గా ప్రసాద్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కనగల్ మండలం లింగాలగూడేనికి చెందిన కదిరె శంకర్ చిన్న కుమార్తె కదిరె మౌనిక నల్లగొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతుండేది. ఈ క్రమంలో కనగల్ మండలం జి.చెన్నారం గ్రామానికి చెందిన బొల్లం శ్రవణ్ మౌనికను ప్రేమిస్తున్నాని వేధించేవాడు. తనను ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరించాడు. 2023 ఆగస్టు 9న మధ్యాహ్నం సమయంలో మౌనిక ఇంటికి వచ్చాడు. ఆమె చేయి పట్టుకుని లాగుతుండగా భయపడి గట్టిగా కేకలు వేసింది. చుట్టు పక్కల వారు వచ్చి శ్రవణ్‌ను మందలించారు. అందరూ చూడడంతో మౌనిక తన పరువు పోయిందని సాయంత్రం సమయంలో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆగస్టు 11న మృతి చెందింది. తన కుమార్తె ఆత్మహత్యకు శ్రవణ్ కారణమని మౌనిక తండ్రి శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ వెంకటయ్య, ఎస్సై అంతిరెడ్డి విచారించి కేసు నమోదు చేశారు. ప్రస్తుత సీఐ ఆదిరెడ్డి, ఎస్సై విష్ణుమూర్తి నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జవహర్‌లాల్ వాదనలతో ఏకీభవించిన జడ్జి దుర్గాప్రసాద్ నాలుగు సెక్షన్ల కింద 12 సంవత్సరాల ఆరు నెలలు జైలు శిక్ష, రూ.17 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయని తీర్పులో పేర్కొన్నారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్సై విష్ణుమూర్తి, లైజన్ ఆఫీసర్ నరేందర్, మల్లిఖార్జున్, కోర్టు కానిస్టేబుల్ యాదగిరి కోర్టుకు సరైన సాక్ష్యాలు సమర్పించి నిందితుడికి శిక్ష పడటంలో సహకరించారు.

సీఎం సమీప బంధువు మృతి



మధుసూదన్ రెడ్డి

మునుగోడు : సీఎం రేవంత్ రెడ్డి సమీప బంధువు వరుసకు మామ అయిన వెదిర మధుసూదన్‌రెడ్డి(95) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి భార్య పూలమ్మ చెల్లెలు సూదిని పారిజాత, సీఎం సతీమణి తల్లి అక్కాచెల్లెలు. కాగా.. మధుసూదన్‌రెడ్డి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. శుక్రవారం ఆయన మృతిచెందడంతో అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు ఇతర నాయకులు మధుసూదన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. శనివారం జరగనున్న అంత్యక్రియలకు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్లు తెలిసింది.

చెరువుగట్టులో కొబ్బరికాయల షాపు సీజ్

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కొబ్బరి కాయల షాప్‌కు టెండర్‌కు సంబంధించి రూ.19లక్షలు పెండింగ్ ఉండటంతో శుక్రవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయ గుట్టపైన కొబ్బరి కాయల విక్రయం కోసం గత సంవత్సరం ఆగస్టు 1న టెండర్ ఏర్పాటు చేశారు. ఈమేరకు టెండర్‌దారుడు రూ.72లక్షలకు వేలం ద్వారా దక్కించుకున్నాడు. అతను ఇప్పటికీ రూ.19లక్షల వరకు బకాయి ఉండటంతో కొబ్బరికాయల షాపును సీజ్ చేసినట్లు ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంద్రాసేనారెడ్డి తెలిపారు.

బహుజనుల విప్లవ కెరటం మారోజు వీరన్న

- ఎమ్మెల్యే మందుల సామేలు



మారోజు వీరన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి: బహుజనుల విప్లవ కెరటం మారోజు వీరన్న అని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. వీరన్న వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడెంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీరన్న విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మారోజు వీరన్న సతీమణి మారోజు చైతన్య, కుమార్తె మారోజు దిశ, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, పూసపల్లి భిక్షం, మల్లేష్, రామచంద్రు, మంగళపల్లి నాగరాజు, కాసర్ల గణేష్, పరమేష్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీరన్న ఆశయాలను కొనసాగిస్తాం



వీరన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

తుంగతుర్తి : మారోజు వీరన్న ఆశయాలను కొనసాగిస్తామని సీపీయూఎస్‌ఐ (ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ) కేంద్ర కమిటీ సభ్యుడు పగడాల కోదండ అన్నారు. మారోజు వీరన్న సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమ నిర్మాత మారోజు వీరన్న వర్ధంతితో పాటు దళిత బహుజన జనత ప్రజాస్వామ్య విప్లవం కోసం నేలకొరిగిన 145 మంది అమరవీరులను స్మరిస్తూ ఈనెల 16 నుంచి మే 31 వరకు అమరవీరుల సంతాప సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ.. ఉమ్మడి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలను రద్దుచేసి ఏ కులానికి ఆ కులం ప్రతిపాదికన ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీయూఎస్‌ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న, మారోజు వీరన్న, సహచరి చైతన్య, వీరన్న కుమార్తె దిశ, లలిత, మట్టపల్లి యాదయ్య, గుడిపల్లి రవి, శరత్, మౌర్య, బెల్లయ్య నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో రసాభాస



అర్వపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల సమావేశంలో ఘర్షణ పడుతున్న కార్యకర్తలు

- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- వాయిదా పడిన అర్వపల్లి సమావేశం

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ మండల సమావేశం ప్రారంభంలోనే రసాభాసగా మారింది. సమావేశానికి ఎమ్మెల్యే, పార్టీ పరిశీలకుడు, డీసీసీ అధ్యక్షుడు రావాల్సి ఉంది. అయితే వారు రాకముందే కాంగ్రెస్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. సమావేశం స్టేజీపైకి కుర్చీలు విసిరారు. దీంతో ఎమ్మెల్యే సామేలు, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి వర్గీయుల మధ్య ఘర్షణ పెరగడంతో పోలీసులు చెదరగొట్టారు. దీంతో సమావేశాన్ని వాయిదావేశారు. ఆ తర్వాత మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం మండల కమిటీ పోటీలో ఉంటున్న కొంతమంది నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కాగా కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఘర్షణ విషయం తెలిసిన జిల్లా ఏఎస్పీ నాగేశ్వర్‌రావు అర్వపల్లికి చేరుకొని కొంతసేపు అక్కడే ఉన్నారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ బాలకృష్ణ జిల్లా స్పెషల్ పార్టీ, స్థానిక పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం



మాట్లాడుతున్న గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి

హుజూర్‌నగర్ : చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి అన్నారు. శుక్రవారం కేవీకే ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటి ఆహార ఉత్పత్తులు, పెరటి తోటల పెంపకంపై హుజూర్‌నగర్ మెప్మా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా చిరుధాన్యాలతో వివిధ రకాల ఉత్పత్తులు అయిన రాగి, జొన్న లడ్డూ, బిస్కెట్లు, మురుకులు ఏ విధంగా తీసుకోవాలని వివరించారు. వీటిని మార్కెట్ చేసుకుని స్వయం ఉపాధిని ఎలా పొందవచ్చో తెలిపారు. మనకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు, విటమిన్లు, మినరల్స్ కూరగాయల్లో ఎక్కువగా ఉంటాయని, వాటి ద్వారా పోషకాహార లోపాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా యోగా ప్రాముఖ్యత, ఔషధ మొక్కల ఉపయోగాలను ఆయుష్ డిపార్ట్‌మెంట్ యోగా ఇన్‌స్ట్రక్టర్ రామాంజి రెడ్డి వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి మహేష్, మెప్మా ఏడీఎంసీ వసంత కుమార్, సీఓ సాయికృష్ణ, కనకదుర్గ, సుజాత, నాగమణి, స్వయం సహాయ సంఘాల, సమభావన సంఘాల మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

- ఇద్దరు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన రామన్నపేట సీఐ



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వలిగొండ : ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. భువనగిరి మండలంలోని సింగన్నగూడెం గ్రామానికి చెందిన సురేష్, మంగ భార్యాభర్తలు. గౌస్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ పల్లెర్ల స్వామితో మంగ వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో భర్త తన భార్యను పలుమార్లు మందలించాడు. బుధవారం తెల్లవారుజామున పల్లెర్ల స్వామి వీరి ఇంటికి రావడంతో సురేష్, స్వామి ఇద్దరు కలియబడ్డారు. ఇద్దరి మధ్య జరిగిన తోపులాటలో సురేష్ మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని స్వామి, మంగ కలిసి ఆటోలో భీమలింగం కత్వ సమీపంలోకి తీసుకువెళ్లి కాల్వలో పడేశారు. బుధవారం కాల్వలో మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. భార్య అనుమానంగా మాట్లాడటంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా.. ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు అంగీకరించింది. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్సై యుగందర్, ప్రొబెషనరీ ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సిద్ధమవ్వండిలా..



ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న రైతులు

పాడిపంట

పెద్దవూర: వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. వేసవి దుక్కులు, భూసార పరీక్షలు, నేల స్వభావాన్ని బట్టి పంటల సాగు ఇతర సాగు విధానాలపై రైతులు మెళకువలు, అవగాహన కలిగి ఉండాలని, వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ పేర్కొంటున్నారు.

లోతు దుక్కులతో మేలు

లోతు దుక్కులు దున్నినప్పుడు భూమిలో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉంటుంది. భూమిలో దాగి ఉన్న లేదా నిద్రావస్థలో ఉన్న పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకి నశిస్తాయి. దుక్కిలో బయట పడిన గుడ్లు, ప్యూపాలను పక్షులు తిని నాశనం చేస్తాయి. అందుకే తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. భూమిలో 9 అంగుళాల వరకు లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకోవడం శ్రేయస్కరం.

కలుపు నిర్మూలన

తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పొలాల్లో పెరిగి పంటలు నాశనం చేస్తాయి. దీనివల్ల భూసారం తగ్గడమే కాకుండా భూమిలోని లోతైన పొరల్లో తేమ తగ్గుతుంది. తుంగ, గరికల వేర్లు దుబ్బుగా ఉండి నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. వేసవిలో బాగా దుక్కి దున్నినప్పుడు ఈ కలుపు వేర్లు , దుంపలు ఏరడంతో వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దున్ని తొలకరి వర్షాలకు గొర్రు, గుంటులతో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారుతుంది. పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల కోతకు గురికాకుండా వాలుకు అడ్డంగా దున్నడం, వర్షపు నీటికి ప్రవాహానికి అడ్డంగా చిన్నపాటి మట్టి, రాతి కట్టడాలు ఏర్పాటు చేసుకోవాలి. గత ఖరీఫ్‌కు సంబంధించి పొలాల్లో ఉన్న ప్రత్తి, కంది, ఆముదం కట్టెలను తొలగించి పొలంలోనే కాల్చివేయాలి.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు

రైతులు ముఖ్యంగా పండ్లతోటలు సాగు చేసే రైతులు భూసార పరీక్షలు చేయించి పంటలు సాగు చేసుకోవాలి. లేకపోతే ఐదేళ్ల వరకు పెంచి కాపు కొచ్చే దశలోనే క్షీణించి రైతుకు పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంది. భూసార పరీక్షలు ద్వారా తమ నేల ఏ పంటలకు అనుకూలమో నిర్ధారించుకోవాలి.

పంట మార్పిడి తప్పనిసరి

ఒకే భూమిలో ఏటా ఒకే పంటను కాకుండా పంట మార్పిడి చేసుకోవాలి. రైతులు ఒకే రకమైన పంటను వరుసగా సాగు చేస్తూ దిగుబడులు రాక నష్టపోతున్నారు. ఒకే పంటను ఏళ్ల తరబడి పండించడం వల్ల చీడపీడలకు ఎప్పుడూ ఆహారం సమృద్ధిగా లభించి అవి వృద్ధి చెందుతాయి. పంట వేర్లు వ్యాపించిన మేర భూమి పొరలు నిస్సారమవుతాయి. పంట మార్పిడి నేలసారాన్ని కాపాడుకోవడంతోపాటు తేమను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. వివిధ రకాల వేరు వ్యవస్థలు కలిగి భిన్నంగా పెరిగే పైర్లను పంట మార్పిడి కోసం ఎంపిక చేసుకోవాలి. పత్తి, ఆముదం, పొద్దు తిరుగుడు వంటి పైర్లు నేల లోపలి నుంచి పోషకాలు తీసుకుంటాయి. పోషకాలు ఎక్కువగా తీసుకునే నువ్వులు, పొద్దు తిరుగుడు వంటి పంటలకు భూమికి పోషకాలు సమకూర్చే అవసరాల పైర్లతో పంట మార్పిడి చేసుకోవాలి. ఇవి బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి. వరుసగా పప్పుధాన్యాల పంటలు కాకుండా నూనె పంటలు సాగు చేయాలి. టమాట, వేరుశనగ, పంటలను ఆశించే లద్దె పురుగు నివారణకు జొన్న, సజ్జ, రాగి ఎర పంటలుగా వేసుకోవాలి.